ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

15న 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ...' కథాసంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.ప్రగతి రచించిన కథాసంపుటి 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ...' ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 15న కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సాహితీస్రవంతి సత్యసాయి జిల్లా కన్వీనర్ హరి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాహితీస్రవంతి, మహిళా కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎంఎం. వినోదిని పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తారని చెప్పారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్ పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు అధ్యక్షతన జరిగే ఈ ఆవిష్కరణ సభలో పుస్తక ప్రచురణకర్త, ఛాయ బాధ్యులు అరుణాంక్ లత, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు సిద్ధగిరి శ్రీనివాస్, వర్ధమాన రచయిత్రి చిలుకూరి దీవెన తదితరులు పాల్గొంటారని చెప్పారు. రచయితలు, సాహిత్యాభిమానులు ఈ ఆవిష్కరణ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కళాశాల ప్రిన్సిపల్, పుస్తక రచయిత ప్రగతి, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి కోరారు.

మానవ మృగాలు

మానవత్వం మంటగలిసింది. పొట్టకూటి కోసం పరాయి రాష్ట్రం నుంచి వలస వచ్చిన కుటుంబంపై కామాంధులు కాటేశారు. సభ్య సమాజం తలదించుకునేలా దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కుటుంబంలోని తండ్రీ కొడుకును తాళ్లతో కట్టేసి, కుటుంబం తలదాచుకుంటున్న రేకుల షెడ్‌లోకి చొరబడిన ఆగంతకులు అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘాతుకానికి పాల్పడింది గంజాయి బ్యాచ్ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దసరా పండుగ రోజు సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో నిర్మాణ దశలో ఉన్న పేపర్‌మిల్ వద్ద జరిగిన ఘటనపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

- ♦ చిలమత్తూరులో గ్యాంగ్ రేప్
- ♦ వలస కుటుంబానికి చెందిన అత్త, కోడలుపై అత్యాచారం
- ♦ నిందితులు గంజాయి బ్యాచ్‌గా అనుమానం
- ♦ ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రత్న
- ♦ పోలీసుల అదుపులో నిందితులు ?

పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న చిలమత్తూరు సిపిఎం నాయకులు

పోలీసులకు అందజేసే వినతిపత్రం చూపుతున్న హిందూపురం సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు గ్రామపంచాయతీ నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న పేపర్ మిల్లు వద్ద మానవ మృగాలు అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన ఈఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... చిలమత్తూరు మండల పరిధిలోని టేకులోడు గ్రామపంచాయతీ నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న పేపర్ మిల్లులో బళ్లారికి చెందిన ఓ కుటుంబం(నలుగురు) పొట్టకూటికోసం వచ్చి అక్కడే ఉంటూ పని చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అటుగా నలుగురు గుర్తు తెలియని ఆకతాయిలు రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చారు. ఎవరూ ఏంటని ఆ కుటుంబ పెద్ద టార్చ్‌లైట్ వేసి అడిగాడు. దీంతో వారు ఆ కుటుంబపెద్దను కొట్టారు. వారిని అడ్డుకోబోయిన ఆయన కుమారుడిని కొట్టి ఇరువురిని తాళ్లతో కట్టేశారు. వారు నివాసముంటున్న రేకులషెడ్‌లోకి అదే కుటుంబానికి చెందిన అత్త, కోడలిపై ఆ నలుగురు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. అనంతరం బాధితులు గ్రామస్తుల సాయంతో చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ :

గ్యాంగ్‌రేప్ ఘటన తెలిసిన వెంటనే ఎస్పీ రత్న శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ దుండగులని త్వరలోనే పట్టుకొంటామన్నారు. పరిశ్రమ వద్ద ఉన్న సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నామన్నారు. గ్యాంగ్‌రేప్ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానిక నాయకులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం ఎస్పీతో ఫోన్లో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోరారు. అదేవిధంగా మంత్రి సవిత కూడా ఫోన్లో ఎస్పీతో మాట్లాడారు. నిందితులపై చర్యలు తీసుకోవాని కోరారు.

పోలీసుల అదుపులో నిందితులు..?

చిలమత్తూరు మండలం నల్లబొమ్మలపల్లి లో శనివారం తెల్లవారుజామున అత్తా, కోడలుపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నలుగురు హిందూపురానికి చెందిన గంజాయి బ్యాచ్‌గా తెలుస్తోంది. వీరు ఇంతకు ముందు పలు కేసుల్లో అరెస్టు అయినట్లు సమాచారం. వీరిలో ముగ్గురు యువకులు మైనర్లని తెలుస్తోంది. మరిన్ని వివరాలు పోలీసుల ప్రెస్‌మీట్‌లో తెలియాల్సుంది.

వలస కార్మికులకు న్యాయం చేయాలి : సిపిఎం

జీవనోపాధి కోసం వలస వచ్చిన తండ్రి కొడుకులని కట్టేసి అత్తా కోడలను అత్యాచారం చేసిన ఉన్మాదులని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేశారు. పోలీస్ స్టేషన్ లో వినతీ పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న పరిశ్రమ వద్ద ట్రైనింగ్ తీసుకున్న సెక్యూరిటీ గార్డులను యాజమాన్యం ఏర్పాటు చేయని కారణంగా పొట్ట కూటికోసం వచ్చిన వలస కూలీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కూడ ఇందులో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వీరిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేష్, రామచంద్ర, నరసింహ తదితరులు కోరారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

భయాందోళనలో ప్రజలు : వలస కుటుంబానికి చెందిన మహిళలపై గ్యాంగ్‌రేప్ ఘటనతో మండల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పండుగ వేళ జరిగిన ఈ ఘటనతో పక్కనే ఉన్న నల్లబొమ్మనపల్లి, కంబాలపల్లి, ఆరుమాకులపల్లి, టేకులోడు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తమ పొలాల వద్దకు పనులకు వెళ్లడానికి భయపడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

హిందూపురం : అత్త, కోడలిపై గ్యాంగ్ రేప్ కు పాల్పడిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఎస్‌పికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సామూహిక అత్యచారానికి పాల్పడిన వారు ఎంతటి వారైన ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వలస కార్మిక చట్టాన్ని అమలు చేసి, వలస కార్మికుల వివరాలను సేకరించాలన్నారు. వలస కార్మికులతో పరిశ్రమల నిర్వాహకులు వెట్టి చాకిరి చేయించుకుంటు, వారికి కనీస సౌకర్యాలను సైతం కల్పించడం లేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్థాయిలో ప్రత్యేక కమిటీ వేసి, వలస కార్మికుల సమస్యలపై విచారణ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, గోపాల్, ఆదిలక్ష్మి, షాహేదా, నాజీయా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు మండలం నల్ల బొమ్మనపల్లి సమీపంలో ఉపాధి కోసం వచ్చిన అత్త, కోడలిపై గ్యాంగ్ రేప్ కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని మంత్రి సవితమ్మ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి సవితమ్మ, ఎంపి పార్థ సారథి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోం మంత్రి అనితతో పాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్నారన్నారు. అమాయక మహిళలపై అతి దారుణమైన చర్య జరిగిందన్నారు. గత ప్రభుత్వం వైఫల్యాల కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గంజాయిని ప్రోత్సహించింది ఎవరో అందరికీ తెలుసునని అన్నారు. గంజాయి వల్ల యువత పెడదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం గంజాయి పై ఉక్కు పాదం మోపుతోందని మంత్రి చెప్పారు. అదేవిధంగా ఘటన జరిగి 24 గంటలు గడవకనే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారని మొత్తం ఆరుగురు నిందితులు ఘటనలో ఉన్నారని వారంతా గంజాయికి అలవాటు పడినవారేనని వారు అనేక కేసుల్లో నిందితులుగా ఉండి, జైళ్లకు కూడా వెళ్ళొచ్చారని పోలీసుల విచారణలో తెలుస్తున్నాయని మంత్రి అన్నారు. ఘటనలో పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్న వైసీపీ వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎంపి పార్థ సారథి మాట్లాడుతు నిందితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి రామాంజినమ్మ, హిందూపురం పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిలమత్తూరు మండలంలో వలస కార్మిక కుటుంబానికి చెందిన అత్తా కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలి. బళ్లారి నుండి ఉపాధి కోసం వచ్చిన కుటుంబానికి చెందిన మగవారిని కత్తులతో బెదిరించి కట్టిపడేసి అత్త కోడలిపై సామూహిక అత్యాచారం చేయడం దారుణం.దుండగులను వెంటనే అరెస్టు చేయాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి. చిలమత్తూరు సంఘటన వలస కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తోంది.

వి. రాంభూపాల్
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

బాధితులకు న్యాయం చేయాలి

చిలమత్తూరు మండలంలో అత్తా కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన మహిళలపై ఎంతటి అకృత్యాలు జరుగుతున్నాయో ఈ సంఘటన సాక్ష్యం. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి

వి. సావిత్రి
ఐద్వా రాష్ట్ర కోశాధికారి

దోషులను కఠినంగా శిక్షించాలి

వలస కార్మిక కుటుంబానికి చెందిన మహిళలపై సామూహిక అత్యాచార ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి. అ అత్యాచార ఘటనకు పాల్పడింది గంజాయి ముఠాకు చెందిన వారనిసోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పోలీసులు లోతుగా విచారణ జరిపాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి.

గౌతమి,
ఐద్వా సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి

మడకశిర బ్రాంచ్ కెనాల్ కు హంద్రీనీవా జలాలు అందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా నీరందించాలని జలసాధన సమితి నాయకులు మంత్రిని కోరారు. ఈ మేరకు వారు ఉమ్మడి జిల్లా జలసాధన సమితి ఆధ్వర్యంలో గొల్లపల్లి రిజర్వాయర్, మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. కాలువ పూడిక తీసి, కాలువలను వెడల్పు చేస్తే తప్ప అన్ని చెరువులకు నీళ్లు అందించడానికి సాధ్యం కాదన్న విషయాన్నిగుర్తించారు. ఈ విషయంపై ఆదివారం పట్టణంలో జిల్లా అసుపత్రి వద్ద మంత్రి సవితమ్మను కలిసి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, పరిగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతకాక విమర్శలు : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి వారికి పాలన చేతకాక, రాష్ట్రంలో ఏమి జరిగిన గత ప్రభుత్వ తప్పిదాలే అని విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక విమర్శించారు. చిలమత్తూరు మండలంలో జరిగిన ఘటనపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వందరోజుల్లో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోవడం అత్యంత దారుణం అన్నారు. ఈ ప్రాంత ప్రజలు మూడు సార్లు బాలకృష్ణను నమ్మి గెలిపిస్తే ఆయన సినిమాలకే పరిమితం అయ్యారని, నియోజక వర్గాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. సనాతన ధర్మాన్ని కాపాడానికి చాలామంది ఉన్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉండే మహిళలకు రక్షణ కావాలని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు వారు విధులను నిర్వర్తించకుండా ఏ చిన్న సంఘటన జరిగిన గత ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని ఊదరగొడుతున్నారు. వంద రోజుల్లో ఏమి చేశారో చెప్పాలన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి దీపిక

బాధితుల భద్రత, ఆరోగ్యం ముఖ్యం : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

సామూహిక అత్యాచార ఘటనకు సంబంధించిన బాధితుల రక్షణ, భద్రత, వారి ఆరోగ్యం తమకు ముఖ్యమని హిందూపురం డీఎస్పీ మహేష్ అన్నారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతోందని, దీని వల్ల బాధితులకు వైద్య సేవలను అందించడానికి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. బాధితులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, కేవలం వైద్యులు, ప్రభుత్వ ప్రతినిధులను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాధితుల వ్యక్తిగత అంతరాయానికి ఇబ్బందులు కలగజేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రెస్ క్లబ్ అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సీనియర్ రిపోర్టర్ సుధాకర్ రూ. 25వేలను ఆదివారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజినేయులు, తోటి పాత్రికేయులకు అందించారు. ఈ నిధులతో కిటికీలకు, పివిసి ప్రేమ్‌లు, అద్దాలను వేయించనున్నామని చెప్పారు.

నేడే 'లిక్కర్' లాటరీ

ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల లాటరీ సోమవారం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు మద్యం దుకాణాల నిర్వహణను ప్రయివేటుకు అప్పగించింది. ఈ మేరకు ఈ నెల రెండవ తేదీ నుంచి మద్యం దుకాణల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. అనంతపురం జిల్లా పరిధిలో 136 దుకాణాలు, సత్యసాయి జిల్లా పరిధిలో 87 దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు 3261 దరఖాస్తులు అందాయి. సగటున ప్రతి దుకాణానికి 23.98 దరఖాస్తులు అందాయి. గరిష్టంగా ఒక దుకాణానికి 51 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా రెండు దరఖాస్తులు వచ్చిన దుకాణాలు ఉన్నాయి. సత్యసాయి జిల్లా 87 దుకాణాలకు 1518 దరఖాస్తులొచ్చాయి. సగటున 17.45 దరఖాస్తులు అందాయి. ఇక్కడ గరిష్టంగా ఒక దుకాణానికి 46 దరఖాస్తులందగా, అత్యల్పంగా ఐదు అందినవీ ఉన్నాయి. వీటికి సంబంధించి సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. ఈ లాటరీ తీసే ప్రక్రియను అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో ఏర్పాట్లను చేశారు. దుకాణాల వారీగా లాటరీ తీసే ప్రక్రియ కొనసాగనుంది. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు లాటరీ కోసం దరఖాస్తు చేసిన వారు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. లాటరీ తగిలితే లక్కు తగిలినట్టేటని ఆశపడుతున్నారు రెండేళ్ల కాల వ్యవధి కోసం ఈ దుకాణాలివ్వనున్నారు.

ఈనెల 16న దుకాణాలు ప్రారంభం : ఈనెల 16వ తేదీ నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్టాకును ఇప్పటికే నిలువ చేసినట్టు కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో 1.20 లక్షల కేసులు స్టాకు గోడౌన్‌లో నిలువనున్నట్టు తెలుస్తోంది. ఇందులో 90 వేలు ఐఎంఎల్ ఉండగా 20 వేల కేసులు బీర్లు ఉన్నాయి. వీటిని కొత్తగా టెండరు దక్కిన వారికి కేటాయిస్తారు. అయితే ఒక్క రోజు వ్యవధిలో కొత్త షాపు ఏర్పాట్లు పూర్తవుతుందా లేదా అన్నది సందేహాస్పదంగా ఉంది. లాటరీ వేసిన వారు కూడా ఇది అంత త్వరగా సాధ్యమవదని అంటుండటం గమనార్హం.

వికలాంగుల అభ్యున్నతికి చేయూత

వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి ఎస్.అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా చేయూతను అందిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఎస్. అబ్దుల్ కూర్ పేర్కొన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహాన్ని అందించేలా తమ శాఖ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాన కల్పించి వాటి బట్టి అర్హులకు లబ్ధి చేకూరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో తమ శాఖ ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమాన్ని గురించి వివరించారు.

ప్రశ్న :ఉమ్మడి జిల్లాలో ప్రోత్సాహాల గురించి వివరించండి.?

జవాబు : ప్రస్తుతం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న వికలాంగుల అభివృద్ధి కోసం అనంతపురంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడి నుండే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల ఉమ్మడి జిల్లాల్లో వికలాంగుల కోసం మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశాం. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ట్యాబులు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశాం.

ప్ర : వికలాంగ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి.?

జ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న 40 శాతం అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగి ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నారు. అయితే వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకూడదు. వీటిని పొందేందుకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ప్ర: వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారా.?

జ : ఏపీ ప్రభుత్వం 2002 నుంచి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్లు పెంచింది. 1:1 నిష్పత్తి ప్రకారం దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, మేధావైకల్యం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యం, మానసిక అనారోగ్యం, బహుళ వైకల్యం ఉన్నవారికి బ్యాక్ లాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

ప్ర: అంధుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటి.?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంధుల కోసం రెండు హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 150 మంది ఆంధులకు పునరావాసం కల్పించాం. వారిలో వందమంది బాలురు, 50 మంది బాలికలు ఉన్నారు. వయోవద్ధులకూ కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న: వికలాంగులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..?

జ : వికలాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా చేయూతను ఇస్తోంది. వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు, వినికిడి పరికరాలు ,వాకింగ్ స్టిక్, ప్లేటు వంటి వివిధ సహాయ ఉపకరణాలను అందిస్తున్నాం. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం.

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ టిఎస్.చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డిఆర్‌ఒ కొండయ్య, ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులుతో కలిసి డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. 15 శాఖల అధికారులతో సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో ప్రాథమిక సమాచారం సేకరించి విపత్తును ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలు, అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు విపత్తు నివారణ పనులను బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. జాగ్రత్తలు, సహాయకచర్యలు, పునరావస కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకి రావాలని, వీలైనంతగా ఈ మూడు రోజులు ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా పునరావస కేంద్రాలకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సంపూర్ణ సహకారాలు అందించాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి పునరావస కేంద్రంలో వైద్య సిబ్బంది మందులతో సిద్ధంగా ఉండాలన్నారు.

నేడు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' రద్దు

పుట్టపర్తి రూరల్ : ఈ నెల 14, 15, 16 తేదీల్లో జిల్లాలో భారీ వర్షసూచనల నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి : పీడీ

జిల్లా వ్యాప్తంగా భారీ వర్ష సూచన నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో వర్కర్లు, ఆయాలు అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ పిడి నాగమల్లేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. వర్షం నీరు కారే పరిస్థితులు ఉన్న, శిథిలావస్థలో ఉన్న కేంద్రాలను నిర్వహించరాదన్నారు. ఈ మూడు రోజులు మరో భవనంలో నిర్వహించాలని సూచించారు. పిల్లలు చలిగాలులు, వర్షం నీటిలో తిరగకుండా చూసుకోవాలని, గర్భిణులు, బాలింతల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.

నంబులపూలకుంట : రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని దీనిపై మండల ప్రజలను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేయాలని తహశీల్దార్ నరేంద్రకుమార్ అధికారులకు సూచించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో పాత భవనాల్లో నివసించే వారికి తగిన సూచనలు చేయాలన్నారు. గర్భిణుల అత్యవసర సేవలపై వైద్య శాఖ అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఎంపీడీవో మాధవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వంక, వాగు ప్రాంతాల సమీపంలో నివసించే వారిని ఖాళీ చేయించి సమీపంలోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసిన రైతులు పంట కోత కోయవద్దన్నారు. ఇప్పటికే పంట చేతికందిన వారు ఇళ్లు, గోదాముల్లో భద్రపరచుకోవాలని సూచించారు. తుఫాను ఉధృతిని బట్టి వరి, వేరుశనగ పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా పొలాలోల గట్లకు గండి కొట్టి దిగువ భాగానికి నీరు మళ్లించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎఎన్ఎంలు, వెటర్నరీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : తుపాను ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహశీల్దార్ నీలకంఠారెడ్డి సూచించారు. వర్షాలతో ఎవరికైనా ఇబ్బంది కలిగితే తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 78932 40304 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావద్దన్నారు. వర్షాల వల్ల ఎవరికైనా ఎలాంటి ఆస్తి నష్టం, పంట నష్టం జరిగితే తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పెనుకొండ : ఈ నెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల పరిధిలో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయించారు. ఆర్డీవో ఆదివారం మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ విద్యుత్ లైన్లు పరిశీలించి మరమ్మతులు అవసర మైతే వెంటనే చేయించాలన్నారు. కోతకు వచ్చిన మొక్కజొన్న, వేరుశెనగ పంటలకు నష్టం వాటిల్ల కుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులను తనిఖీ చేసి మరమ్మతులు ఉంటే సరిచేయాలన్నారు. మూడు నుంచి ఏడు రోజుల లోపు ప్రసవం అయ్యే గర్భిణుల వివరాలు సేకరించి, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేసి వారికి ఏర్పడిన సమస్యలు, ఇబ్బందులను 108, మెడికల్ ఆఫీసర్, కంట్రోల్ రూంకి తెలియజేసేలా అవగాహన కల్పించాలని వివరించారు.

ధర్మవరం రూరల్ : రానున్న నాలుగు రోజులు భారీ వర్ష సూచనల నేపథ్యంలో ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం ఆర్డీవో మహేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో ఏమైనా సంఘటనలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రధానంగా మట్టి మిద్దెలో నివాసం వున్న ప్రజలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పేరూరు డ్యాం, యోగివేమన డ్యాంలో చేపల వేటకు వెళ్లవద్దన్నారు.

ఓబుళదేవరచెరువు : రానున్న 3 రోజులు భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవో సువర్ణ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆర్డీవో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలు, ముఖ్యంగా గర్భినులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పాత ఇళ్లలో ఉండేవారు లోతట్టు ప్రాంతాలైన పోలేవాళ్లపల్లి, కొత్తపల్లి, ఓడి చెరువులోని అశోక్‌నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో వర్షం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, బీసీ హాస్టల్లోలో ఆశ్రయం పొందాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ రంగనాయకులు, వీఆర్వో శ్రీలత, అగ్రికల్చర్ నరేంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి, షమీం, పోలీస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండండి : ఏవో

గుడిబండ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో భారీ వర్ష సూచనల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వీర నరేష్ సూచించారు. రైతులు పంట కోతలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పంట కోసి ఉంటే పొలాల్లో కాకుండా రక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని సూచించారు.

కదిరి టౌన్ : రానున్న మూడు రోజులు భారీ వర్ష సూచనల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ ఓ ప్రకటనలో సూచించారు. తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి హెల్ప్ లైన్ నెంబర్లు ఏర్పాటు చేశామని ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ప్రజలు, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నెేరాలు ఘోరాలు

గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి ఒకరు మృతి..

మరొకరు గల్లంతు

ప్రజాశక్తి-పెనుకొండ

దసరా పండుగ రోజు స్నేహితులతో సరదాగా గడిపేందుకు వచ్చి గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఈదులాడుతూ ఓ యువకుడు గల్లంతు కాగా కుటుంబ సభ్యులతో కలిసి రిజర్వాయర్ వద్ద సరదాగా గడిపేందుకు వచ్చిన మరొక వ్యక్తి కాలుజారి రిజర్వాయర్‌లో పడి మృతి చెందిన సంఘటనలు ఆదివారం చోటు చేసుకున్నాయి. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని అమ్మవారుపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి(20) అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువు తున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి స్నేహితులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లారు. ఈత కొడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి నీటి ప్రవాహంలో రిజర్వాయర్‌లోకి కొట్టుకుపోయాడు. స్నేహితులు, అక్కడున్న వారు చంద్రశేఖర్‌రెడ్డి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చంద్రశేఖర్ రెడ్డి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక హిందూపురం పట్టణంలోని నింకంపల్లి చెందిన అనీసుల్లాఖాన్(42) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం గొల్లపల్లి రిజర్వాయర్‌కు వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా రిజర్వాయర్ ఒడ్డున ఈత కొడుతుండగా అనీసుల్లాఖాన్ కాలుజారి రిజర్వాయర్‌లోకి పడిపోయాడు. చుట్టుపక్కల వారు బయటికి తీసే లోపే మృతి చెందాడు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయా సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పందిపర్తి రైల్వే గేట్‌లో ఆదివారం ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఎస్ఐ శ్రీనివాసులునాయక్ తెలిపిన వివరాలు.. స్థానిక స్నేహలతనగర్ కాలనీలో నివాసం ఉంటున్న రామాంజనమ్మ(45)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఆదివారం ఉదయం చకర్లపల్లి గ్రామ సమీపంలో రైలు కింద పడేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు గుర్తించి కాపాడారు. దీంతో ఆమె అక్కడి నుంచి పందిపర్తి వద్దకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలిసిన వెంటనే భర్త శ్రీనివాసులు అక్కడికి చేరుకొని బోరున విలపించాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ....

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సిద్దయ్యగుట్టకి చెందిన శ్రీనివాసులు(46) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. శ్రీనివాసులు పట్టణంలో మెడికల్ ఏజెన్సీ, మందుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. కొంత కాలంగా వ్యాపారం సరిగ్గా జరగక అప్పులు ఎక్కువై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను చంపిన భార్య అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

భర్తను హత్య చేసిన భార్యను అరెస్టు చేసినట్లు రూరల్ ఇన్‌ఛార్జి సిఐ రెడ్డప్ప తెలిపారు. వివ రాలు.. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మపురి గ్రామంలో దేవరకొండ గోవిందు(55), అంజనమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కూతురు గంగాదేవి, కొడుకులు గణపతి, ఉపేంద్ర సంతానం. ముగ్గురికీ వివాహమైంది. చిన్న కొడుకు పులివెందులలో నివాసం ఉంటున్నారు. పెద్ద కొడుకు గణపతి భార్య పిల్లలతో ఒక ఇంట్లో ఉంటుండగా గోవిందు భార్యతో కలిసి మరో ఇంట్లో కాపురం ఉంటున్నారు. గోవిందు కొన్నేళ్లుగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయంపై అంజనమ్మ తరచూ భర్తతో గొడవ పడుతూ ఉండేది. ఈ క్రమంలో గత గురువారం మధ్యాహ్నం వారి మధ్య మరోమారు గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో అంజనమ్మ రోకలిబండతో గోవిందుపై గట్టిగా మోదడంతో అతడు మృతి చెందాడు. ఈ కేసులో నిందితురాలు అంజనమ్మను శనివారం ఉదయం రావులచెర్వు క్రాస్ వద్ద రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐతో పాటు ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

మిట్టపల్లిలో గొర్రెలు అపహరణ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మనిగే రంగయ్యానాయుడుకు చెందిన 17 గొర్రెల ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. ప్రతి రోజూ గొర్ల మంద వద్ద నిద్రించేవాడినని, శుక్రవారం రాత్రి తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఇంటి వద్దే ఉన్నానన్నారు. అదే అదునుగా భావించిన దుండగులు 17 గొర్రెలను ఎత్తుకెళ్లారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

కంటైనర్ బోల్తా.. ఆవులు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రూరల్ పరిధిలోని సీతారాంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ కంటైనర్ బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు ఆవుల లోడుతో వేగంగా వెళ్తున్న కెఏప్‌సి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాలుగు ఆవులు మృత్యువాత పడగా మరికొన్ని ఆవులకు స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పశువైద్యులు శేఖర్ ఘటనా స్థలికి చేరుకొని మృతి చెందిన గోవులకు పంచనామా చేశారు. గాయపడిన గోవులకు చికిత్స చేశారు. అనంతరం మృతి చెందిన ఆవులను జెసిబి సాయంతో ఖననం చేశారు. డ్రైవర్ దొరికితే మరిన్ని వివరాలు బయటకు వస్తాయన్నారు. ఈ ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మిగిలిన ఆవులను పశువైద్యాధికారులు పోతులనాగేపల్లి గోశాలకు తరలించారు.

బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలంలోని చిప్పలమడుగు గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. ఒడిసి మండలానికి చెందిన అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై చిప్పలమడుగు వెళ్లి తన మేనమామను పరామర్శించి తిరుగుపయనమయ్యాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు, రాకేష్ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో అతివేగంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో అనిల్‌కుమార్, వీరనారాయణ, ఆంజనేయులు, రాకేష్‌కు గాయాలవడంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆంజనేయులు, రాకేష్‌లను కుటుంబ సభ్యులు అనంతపురం తరలించినట్లు తెలుస్తోంది.

నేడు మడకశిరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని టిడిపి నాయకులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, కుమారస్వామి, దాసిరెడ్డి, తదితరులు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో ప్రతి రోజూ రూ. 5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందిస్తారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు సిఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

కదిరిలో..

కదిరి టౌన్ : పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభిస్తారని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. ముందుగా స్థానిక మదనపల్లి రోడ్డులోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నుంచి అన్న క్యాంటీన్ వరకూ ర్యాలీ నిర్వహిస్తారని, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అగళి

ఎమ్మెల్యే చొరవతో బోరు వేయిస్తున్న నాయకులు

మండలంలోని హల్లికెర పంచాయతీలో తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పరిష్కారం చూపారు. రెండేళ్లుగా గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో బోరు వేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. హామీ మేరకు గత గురువారం సాయంత్రం గ్రామంలో బోరు వేయించగా సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. అలాగే బ్యాడిగెర గ్రామం బిసి కాలనీలో పదేళ్లుగా తాగునీటి సమస్య నెలకొనగా టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం రాత్రి బోరు వేయించగా సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. జడ్పీటీసీ ఉమేష్, మండల టీడీపీ అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వంద బోర్లు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అందులో భాగంగా 82వ బోరు పి.బ్యాడిగెర గ్రామంలో వేయించారని తెలిపారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో సోమవారం నుంచి 'పల్లె పండుగ' నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల కింద గ్రామ సభల్లో ఆమోదం పొందిన పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. సోమవారం ఉదయం నల్లబోయనపల్లిలో, మధ్యాహ్నం డి.చెర్లోపల్లి బిసి కాలనీలో సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తామన్నారు. 15న గరికలపల్లి, 16న మాల్యవంతం, 17న దంపెట్ల, పోట్లమర్రి, 18న ఓబుళాపురం, తంబాపురం, 19న సంగాల, అప్పరాచెరువు, 20న ఈదుల ముష్టూరు, సంజీవపురం, బత్తలపల్లిలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లకు భూమి పూజ, పండ్ల తోటల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొత్తచెరువు : ఈ నెల 14వ తేదీ కొత్తచెరువు, కె.లోచర్ల గ్రామపంచాయతీల్లో 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో నటరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల నిరసనలు ఎనిమిదో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఉద్యోగులు, కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై యాజమాన్యంకు తమ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ డిమాండ్లపై ఏడు రోజుల నుంచి అధికారులకు వినతుల ద్వారా తెలిపినా ఎటువంటి మార్పులు రాలేదన్నారు. నాలుగో రోజు చర్చలకు పిలవగా తాము యాజమాన్యం ముందుంచిన ఏ ఒక్క డిమాండ్‌ను నెరవేర్చలేదన్నారు. డిపో మేనేజర్ తమకు ఇప్పటికీ ఎటువంటి హామీ ఇవ్వలేదని, భవిష్యత్తులో నిరసనలు ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కెబి.నాగార్జునరెడ్డి, ముస్తఫా, బాబు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కర్నాటకలోని బళ్లారి ప్రాంతం నుంచి ఓ కుటుంబం ఉపాధి కోసం వలస వచ్చి చిలమత్తూరు మండలంలోని నల్లబోయినపల్లి గ్రామంలో జీవనం సాగిస్తుండగా అత్త కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిలమత్తూరు మండలంలోని ఆర్ఎస్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న తండ్రీకొడుకులు కుటుంబ సభ్యులతో పాటు పరిశ్రమ పరిధిలోని ఓ రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారన్నారు. రాత్రి 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన దుండగులు తండ్రీ కొడుకులపై దాడి చేసి కత్తి చూపించి చంపుతామని బెదిరించి అత్త కోడళ్లను సామూహిక అత్యాచారం చేసి వెళ్లిపోయారని తెలిపారు. ఈ సంఘటనకు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కూడా ఓ కారణమని తెలిపారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యం, భద్రతా లోపంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. పోలీసు యంత్రాంగం దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, మండల నాయకులు మహబూబ్ బాషా, నాగప్పరెడ్డి, మురళి పాల్గొన్నారు.

గోరంట్ల : చిలమత్తూరు మండలంలోని నల్లబోయినపల్లి గ్రామంలో ఉపాధి కోసం వలస వచ్చిన ఉమ్మడి కుటుంబంలో అత్త, కోడలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బాబుకు ఫిర్యాదు చేశారు. వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ జిల్లాలో వరుసగా మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వలస వచ్చిన అత్త కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు నర్సింపల్లి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యులు తిప్పన్న, కెవిపిఎస్ మండల నాయకులు పాలసముద్రం భాస్కర్, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకురాలు రత్నమ్మ, నంజుండప్ప పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వన్ టౌన్ ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పురుషులను కత్తితో బెదిరించి అత్త, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగం, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మారుతి, చేనేత నాయకులు హరి, సిఐటియు పట్టణ నాయకులు జెవి.రమణ, టి.అయూబ్‌ఖాన్, ఎస్‌హెచ్.బాషా, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన అభిమానులు, వైసిపి నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అమర్నాథ్‌రెడ్డి, నాయకులు చౌడప్ప, నరసింహులు, పెద్దన్న, వడ్డే బాలాజీ, చందు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు బగ్గిరి బయపరెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీటీసీ కోటి నరేష్, ఉపాధ్యక్షులు కోటి సురేష్ ఆర్డీటీ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో కేతిరెడ్డి ఎమ్మెల్యేగా ధర్మవరం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, మాజీ సర్పంచి చెడిపోతుల గోపాల్, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, యోగానండాచారి, సురేష్, గవ్వల రమేష్ పాల్గొన్నారు.

పుట్టపర్తి విద్యుత్ డీఈగా శివరాం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి డివిజన్ విద్యుత్ డీఈగా ఆదివారం శివరామ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కదిరి ప్రాంతంలో ఏఈ, ఏడీఈగా విధులు నిర్వహించారు. విభజన అనంతరం ఐదేళ్లకు పైగా తెలంగాణలో సైతం విధులు నిర్వహించారు. ఇటీవలే తెలంగాణ నుంచి ఎపికి తిరిగి వచ్చి తిరుపతి ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై పుట్టపర్తి డీఈగా వచ్చారు. నూతన డీఈకి విద్యుత్ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఐకు టిడిపి నాయకుల సన్మానం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని కొండకమర్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం నూతన ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అలాగే శ్రీసత్యసాయి బాబా చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, డి.చెన్నకేశవులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బడిశం సురేష్, కోటబజార్ భాస్కర్, కృష్ణమూర్తి, ఎస్.ఆంజనేయులు, బిలేనాయక్, చంద్ర, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఉషశ్రీ చరణ్‌ను కలిసిన వైసిపి పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదివారం మండల జడ్‌పిటిసి డిసి అశోక్ ఇంటిని వచ్చారు. ఈ విషయం తెలిసి మాజీ సర్పంచి రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నూతన పట్టణ అధ్యక్షులు గోవిందమ్మగారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గట్టా మంజునాథ్ ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని వైబి.హళ్లి పంచాయతీ పరిధిలోని పత్తికుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆదివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో తిమ్మేగౌడ్, హనుమంతగౌడ్, శశికుమార్, రాధాకృష్ణ, రంగప్ప, ఎంహెచ్ హనుమంతరాయప్ప, చాకలి నాగరాజు, జగదీష్‌తో పాటు 50 కుటుంబాలు టిడిపిలో చేరగా తిప్పేస్వామి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, వైబి.హళ్లి ఎస్ఎంసి ఛైర్మన్ లక్ష్మీనారాయణ, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సూర్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ డీఎస్పీ మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్యామ్‌సుందర్‌మూర్తి(ఫైల్‌ఫొటో)

మండల పరిధిలోని తలమర్ల గ్రామానికి చెందిన విశ్రాంత డీఎస్పీ శ్యామ్‌సుందర్‌మూర్తి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అనారోగ్యంతో కొన్ని రోజులుగా అనంతపురం నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన గతంలో కర్నూలు జిల్లాలో డీఎస్పీగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమారులు ఉన్నారు.

మాజీ సర్పంచి లక్ష్మీనారాయణప్పకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మైనగానపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయానికి వచ్చే భక్తులు తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని రాళ్లపల్లి మాజీ సర్పంచి లక్ష్మీనారాయణప్ప, మాజీ ఎంపీటీసీ నజీర్, జ్ఞానవృక్ష ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వరప్రసాద్, తదితరులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు గ్రామంలో బోరు వేయంచగా నీరు పుష్కలంగా పడ్డాయి. బోరు వేయించడానికి కృషి చేసిన లక్ష్మీనారాయణప్పను ఆదివారం గ్రామస్తులు, టిడిపి నాయకులు శాలువాతో సన్మానించారు. అలాగే గ్రామంలో నూతన యానిమేటర్‌గా చిన్నచిత్తప్ప భార్య పవిత్రను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి రూరల్ నూతన ఎస్ఐ లింగన్నను ఆదివారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీ ఎస్ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, సత్యసాయి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు.

ఎస్ఐ లింగన్నను కలిసిన టిడిపి నాయకులు

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు ఎంపికి ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మండలంలోని దుద్దేబండ గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి రావాలని ఆదివారం శ్రీవాల్మీకి సంఘం కమిటీ సభ్యులు ఎంపి బికె.పార్థసారధిని ఆహ్వానించారు. వారు అనంతపురం నగరంలోని ఎంపి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఈ

అనంతపురంలోని ఎంపి నివాసంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేంద్రబాబు ఎంపి బికె.పార్థసారధిని మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే ఇచ్చి సన్మానించారు.

ఎంపి పార్థసారధికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న కమిటీ సభ్యులు, పూలబొకే ఇస్తున్న ఎస్ఈ